ఖరీఫ్ సాగుకు శ్రీకారం



భట్టిప్రోలు-వెల్లటూరు రహదారిలో మోటారుతో నారుమడికి సిద్ధం చేస్తున్న రైతులు



పంట పొలంలో సాగవుతున్న జనుము

- ఊపందుకుంటున్న వ్యవసాయ పనులు
- అన్నదాతలు అధికారుల సూచనలు పాటిస్తే మేలు

భట్టిప్రోలు: ఖరీఫ్ సాగుకు రైతాంగం సమాయత్త మైంది. వర్షాలు కురిసినా కురవకపోయినా దేవుడిపైనే భారం వేసి భట్టిప్రోలు మండలంలోని రైతులు వ్యవసాయ పనులను ఇప్పటికే మొదలు పెట్టారు. నేలను చదును చేస్తూ సేంద్రియ ఎరువులు చల్లుతూ దుక్కి దున్నుతూ హడావిడిగా కనిపించారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో అన్న దాతలు పనులలో బిజీగా ఉన్నారు. కొందరు రైతులు నారుమళ్లు పోసేందుకు సిద్ధమయ్యారు. మరి కొందరు విద్యుత్ మోటార్లతో మెరక ప్రాంతాల్లో నారుమళ్లు పోసారు. మరికొంత మంది రైతులు ఇప్పుడే నారుమళ్లు పోసి సాగుకు సమాయత్తమయ్యారు. మండలంలో ఈ ఏడాది సుమారు 15 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. ఏది ఏమైనా వర్షాలు సక్రమంగా కురిసి కాల్వల ద్వారా నీరందితే ఖరీఫ్‌లో నాట్లు పూర్తి కాగలవని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పొలాలు పదునెక్కడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఖరీఫ్ పురస్కరించుకుని రైతులు ఇప్పటికే రైతులు వెద సాగు చేపట్టారు

నారుమడికి తప్పనిసరిగా పశువుల ఎరువు వేయించి రెండున్నర సెంట్ల నారుమడికి అరకిలో పొటాష్ వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రెండు మూడు ఆకులతో ఉండే వరకు ఆరుతడి పెట్టాలి. నారుమడిలో పురుగుల నివారణకు మొలకెత్తిన 7వ రోజున పది సెంట్ల నారుమడికి 1800 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు వాడాలని చెబుతున్నారు.

క్లుప్తంగా

420 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రేపల్లె రూరల్: పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో ఆసుపత్రి వైద్యులు చేతన్, లక్ష్మిలు 420 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 242 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సక్సేన, పావులూరి శివ శంకర్ వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ పరుగు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 75 ఏళ్ల వేడుకలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఐసీఏఐ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సీఏ రన్ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంపాలెంలోని రమేష్ హాస్పిటల్స్ నుంచి శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ భవన్ వరకు నిర్వహించిన పరుగులో సీఏలు పాల్గొన్నారు. ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు చాప్టర్ ఉపాధ్యక్షుడు చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, సీఏలు, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ నిర్మాణంలో మోసంపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నామని చెప్పి, నగదు తీసుకుని చెప్పిన సమయానికి నిర్మించకుండా మోసం చేసిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామంలో నయయుగ గ్రాండ్ పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టాడు. ఈ మేరకు రేపల్లెకు చెందిన పేటేరు మురళి అనే వ్యక్తి వద్ద రూ.21 లక్షలు నగదు తీసుకున్నాడు. గోగాన జవహర్, గోగాన సాయి, గాగాన శ్రీదేవి, జీవి రమణ అనే నలుగురు తనను మోసం చేశారని మురళి ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెప్పిన సమయం దాటిపోయినా అపార్ట్‌మెంట్ నిర్మించకపోగా.. కాలయాపన చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

కార్మెల్ మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఉదయం నుంచి జోరుగా వర్షం పడుతున్నా కడప, ధర్మవరం, నంద్యాల, ఆదోని ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు బాల ఏసు దేవాలయంలో నిర్వహించిన దివ్య పూజా బలి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొండను చేరుకుని.. తల నీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ వెంట తెచ్చుకున్న విత్తనాలను కార్మెల మాత వద్ద ఉంచి, పూజలు చేశారు. వర్షాలు పడే సమయంలో పొలాల్లో విత్తుకు ముందు ఇక్కడ ప్రార్థనలు చేసి, విత్తుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

బాపట్ల: కంటి వైద్య పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని కమ్మజన సేవా సమితి అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కమ్మజన సేవా సమితి, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం కమ్మజన సేవా సమితి కల్యాణ మండపం కొత్త పాలెం నందు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముప్పలనేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మజన సేవా సమితి తరపున గత కొన్ని సంవత్సరాలుగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అంతా వినియోగించుకోవాలని కోరారు. శంకర కంటి ఆసుపత్రి వారిని అభినందించారు. వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బైపిన్ రాహుల్, డాక్టర్ అబోలి, సెక్రటరీ ఆర్.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ కె.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఈ.హరిబాబు, శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు

కర్లపాలెం: మండలంలో పలు రకాల పింఛన్ల లబ్ధిదారులకు సోమవారం నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎంపీడీవో నేతాజీ తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయం సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. మండలంలో మొత్తం 8,059 మందికి రూ.5.4 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ సచివాలయం ఆవరణలో ఈనెల 1న ఉదయం 9 గంటలకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొనే ఈ కార్యక్రమంలో పెన్షనర్లు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో ఉపాధి పథకం గ్రామసభలు



పెరవలిపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

పెరవలిపాలెం(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు, పెరవలిపాలెం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు ఆదివారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో కూలీలకు సకాలంగా వేతనాలు అందించారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. పెరవలి పాలెం గ్రామంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక బృందం మూడు రోజులు ఆడిట్ చేయడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 2న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల మైథిలీ రాణి, విష్ణు మొలకల వెంకట రెడ్డియ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద అంధకారం



వైఎస్సార్ విగ్రహం వద్ద లైటు తీసేసిన విద్యుత్ స్తంభం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మొన్నటి వరకు విద్యుత్ స్తంభానికి వెలుగుతున్న లైటు లేకపోవడంతో అంధకారం అలముకుంది. టీడీపీ నేతలు కావాలనే దురుద్దేశంతో విగ్రహం వద్ద వెలుతురు ఉడకుండా లైటును, వైరును తప్పించారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలే తప్ప ఇలా విగ్రహాలు, శిలా ఫలకాలు, ఫ్లెక్సీల బ్యానర్లు, సచివాలయాలు, ఆర్బీకేలు తదితర విషయాలలో టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపడం పట్ల పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విగ్రహంతో పాటు ఉన్న ఎన్టీఆర్, మోటూరు హనుమంతరావు విగ్రహాల వద్ద లైట్లు యథాతథంగా వెలుగుతున్నాయి. ఇప్పటికైనా టీడీపీ నాయకులు ఇటువంటి ఆగడాలకు స్వస్తి పలకాలని పలువురు కోరుతున్నారు.

గోపీకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలి



గోపీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసన శంకరరావు

యాజలి(కర్లపాలెం): ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లి దుండగుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన దాసరి గోపీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఆదివారం గోపీకృష్ణ కుటుంబ సభ్యులను బీసీ సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు, భర్తను కోల్పోయిన భార్యకు అండగా నిలిచి మానసిక ధైర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. తమ బిడ్డను అప్పులు చేసి అమెరికా పంపించిన తల్లిదండ్రులకు బిడ్డ పోవటంతో అప్పులు, అనారోగ్యాలు మిగిలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. పరామర్శించిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, నటరాజన్, కూరపాటి సత్యంరాజు, యల్లావుల సురేష్, కేసన స్వాములు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి నోడల్ అధికారుల నియామకం

వేమూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీవో శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంపిణీ బాధ్యతలను గ్రామ సచివాలయం సిబ్బందికి అప్పగించడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయం సిబ్బందిపై నోడల్ అధికారులను నియామకం చేయడం జరిగిందని చెప్పారు. జంపని, పోతుమర్రు, చంపాడు, బూతుమల్లి గ్రామాలకు నోడల్ అధికారి ఎంపీడీవో శేషగిరిరావు, వేమూరు గ్రామ సచివాలయం 1,2లకు నోడల్ అధికారిగా తహసీల్దార్ కిరణ్, బలిజేపల్లి, వరహాపురం గ్రామాలకు నోడల్ అధికారిగా పంచాయతీ విస్తరణాధికారి శేఖర్, చదలవాడ, కాకర్లమూడి గ్రామాలకు నోడల్ అధికారిగా మండల విద్యా శాఖాధికారి-2 రోజ్ ల్యాండ్, కోడిపర్రు, పెనుమర్రు, అబ్బనగూడవల్లి గ్రామాలకు మండల విద్యా శాఖాధికారి ఐ వెంకటేశ్వర్లు, చావలి గ్రామ సచివాలయం 1, 2లకు పంచాయతీ రాజ్ ఏఈ మరియదాసు, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాలకు ఏపీఎం శోభన్, పెరవలి, పెరవలి పాలెం గ్రామాలకు ఏపీవో సత్యకుమార్‌లను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

చేతిరాత నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణింపు



ఉపాధ్యాయులతో రవీంద్రనాథ్‌రెడ్డి, రామ్మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో జీవితంలో అన్ని రంగాల్లో రాణించగలరని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి-పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా చేతిరాతను అందంగా మలచుకోవాలని సూచించారు. దీని ద్వారా ఏకాగ్రత, మానసికపరమైన మార్పులు సంభవిస్తాయని తెలిపారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో తోటి ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించడాన్ని ప్రశంసించారు. విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిర్వాహకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహనరావు, ఈ.అనిల్‌కుమార్, ప్రసాద్, షాజీర్, నాగలక్ష్మి, సత్యనారాయణ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

నకిలీ డాక్యుమెంట్లతో స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: అద్దెకు ఇచ్చిన స్థలానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేసిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయపురి కాలనీ 7వ లైన్‌కు చెందిన శెట్టి జ్యోతిలక్ష్మి తన భర్త పూర్వికులకు చెందిన వాస వీనగర్‌లోని 500 గజాల స్థలం మేకతోటి వెంకటప్పయ్య అనే వ్యక్తికి రూ.12 వేలకు అద్దెకు ఇచ్చింది. ఈ క్రమంలో వెంకటప్పయ్య జ్యోతిలక్ష్మికి తెలియకుండా స్థలానికి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, విద్యుత్ మీటరు, స్థలంలో షెడ్లు నిర్మించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నకిలీ డాక్యుమెంట్‌లో తన భర్తకు మొదటి భార్య విజయలక్ష్మి అని ఆమె పేరుతో విద్యుత్ మీటరును పొందారని ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శిల-శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాల ఆవిష్కరణలో అతిథులు, సంస్థ నిర్వాహకులు

నగరంపాలెం: గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ 15వ వార్షికోత్సవంలో భాగంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు రచించిన శిల-శిల్పం, వైద్య నిఘంటువు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు.

ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కాకతీయ కన్వెన్షన్ సెంటర్ అధ్యక్షులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సంజీవి హాస్పిటల్స్ డాక్టర్ అర్థలపూడి సృజన్‌కుమార్ హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ ఆచార్యులు శ్రీహరి మురుగుడు, లీగల్ అడ్వైజర్ అండ్ ఫ్యామిలీ కౌన్సిలర్ మొవ్వ మృత్యుంజయరావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా 1,500 సేవా కార్యక్రమాలు, 50 గ్రంథాలు ప్రచురణ చేసిన ఘనత సంస్థదని ప్రశంసించారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి రామస్వామి కృషి

లక్ష్మీపురం: తెనాలి తాలూకా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన కాబోతు రామస్వామి భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి జీవితమంతా కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు జల్లి విల్సన్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం కాబోతు రామస్వామి 68వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో పాటు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ముప్పాళ్ల నాగేశ్వరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ రైతులు, కూలీల అభ్యున్నతికి రామస్వామి అలుపెరుగని పోరాటాలు సాగించారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాస్, రామస్వామి మనుమరాలు కోటేశ్వరి, మెడికల్ ఎంప్లాయీస్ రాష్ట్ర నాయకులు బి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు.

సమన్వయంతో పనిచేసి ప్రగతి సాధిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి



హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

ముగిసిన మండల పరిషత్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నివాస గృహాల సమీపంలో నీటి నిల్వలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తాగునీరు, ఉపాధి హామీ పథకం, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను పలువురు సభ్యులు ప్రస్తావించగా అధికారులు సమాధానాలు చెప్పారు. ఎంపీపీ పెనుమాల సుశీల, మండల ఉపాధ్యక్షులు రావు నెహ్రూలక్ష్మి, పీతా వెంకటేశ్వర రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ముద్దుబిడ్డ రాయప్రోలు



రాయప్రోలు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

బాపట్ల: తన అద్భుతమైన దేశభక్తి, కవిత్వంతో రాయప్రోలు ప్రజలను జాగృతం చేశారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. రాయప్రోలు సుబ్బారావు 40వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పి.సి.సాయిబాబు మాట్లాడుతూ మహాకవి రాయప్రోలు సుబ్బారావు 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని' అంటూ నినదించారని గుర్తు చేశారు. తెలుగు జాతి అన్నా, తెలుగు భాష, తెలుగు సంస్కృతి అన్నా ఆయనకు వల్ల మాలిన అభిమానమని చెప్పారు. 'తెలుగు తల్లి' అనే భావనకు ఆయనే ప్రాణం పోశారని తెలిపారు. ఆ విధంగా బాపట్లను 'తెలుగు తల్లి పుట్టినిల్లు'గా తీర్చిదిద్దారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాఘవరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కు సత్కారం



రమేష్‌ను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

రేపల్లె రూరల్: పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసిన పాశం రమేష్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో పీఆర్‌టీయూ నాయకులు రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయునిగా రమేష్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల రాంబాబు, కార్యదర్శి సూరగాని సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు జానీ షాహిద్‌బేగ్, ప్రధాన కార్యదర్శి ఎం.అంకయ్య, జిల్లా కౌన్సిలర్ వెంకటాచాలం తదితరులు పాల్గొన్నారు.